క్లుప్తంగా

విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలి

ఎదులాపురం: పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద విద్యుద్దీపాలు ఏర్పాటు చేయించాలని నేతకాని మహర్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గం శేఖర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జోగు రామన్నకు వినతిపత్రం అందజేశారు. నేతకాని మహర్ సంక్షేమ సంఘం యూత్ ప్రెసిడెంట్ రాహుల్ జాంబడే, సూరజ్ సోన్ కాంబ్లే, మహేశ్, అశ్వజిత్, వికాస్ పాల్గొన్నారు.

బ్యాంక్ సేవింగ్ ఖాతాలపై అవగాహన

ఆదిలాబాద్‌టౌన్: ప్రతిఒక్కరూ బ్యాంక్ ఖాతాలు కలిగి ఉండాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ మధుసూదన్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాలలో బ్యాంక్ సేవింగ్స్ ఖాతాలు తెరవడంపై అవగాహన కల్పించారు. వివిధ రకాల ఖాతాలు, వడ్డీ రేట్ల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జంగం అనిత, చంద్రకాంత్, వందన, బ్యాంకు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

బోథ్: మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయ పునర్నిర్మాణం కోసం సీజీఎఫ్ నిధులను విడుదల చేయాలని ఆలయ కమిటీ సభ్యులు హైదరాబాద్‌లోని రాష్ట్ర దేవాదాయ కమిషనర్ అనిల్‌కుమార్, దేవాదాయశాఖ న్యాయ అధికారి కొమురయ్యలను కలిసి విన్నవించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్లకొండ సురేందర్, పట్టణ అధ్యక్షుడు మెరుగు భోజన్న, చంద్రమోహన్, న్యాయ సలహాదారు హరీష్, న్యాయవాది వంద్రం శంకర్, సాయికుమార్ పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం

నేరడిగొండ: మండల కేంద్రంలోని శ్రీ సద్గురు శబరిమాత ఆశ్రమంలో తిరుపతి భక్త కమిటీ ఆధ్వర్యంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం శుక్రవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. వచ్చే సంవత్సరం 21 జనవరి 2024న తిరుపతిలో కోటి హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రచార రథం ఈనెల 21న తిరుపతి నుంచి బయలుదేరి ప్రతి గ్రామానికి చేరుకొని అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో శబరిమాత భక్తులు, హిందూ సంస్థల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం జిల్లా మిషన్ కో ఆర్డినేటర్ యశోద అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని విజన్ పారామెడికల్ కళాశాలలో ప్రభుత్వ పథకాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలు, యువతుల కోసం ప్రభుత్వం అనేక చట్టాలు అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

'పోలీసులపై కేసు నమోదు చేయాలి'

నేరడిగొండ: గిరిజన మహిళపై దాడి చేసిన పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని గిరిజన లంబాడాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు ఎలాంటి కారణం లేకుండా గిరిజన మహిళపై చిత్రహింసలకు పాల్పడ్డారని మండిపడ్డారు. పోలీసులపై చర్యలు తీసుకోవాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

అరెస్టులను ఖండిస్తున్నాం

ఎదులాపురం: సమస్యలను పరిష్కరించాలని నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను అరెస్టు చేయడాన్ని సమగ్ర శిక్ష ఉద్యోగుల అధికార ప్రతినిధి పవార్ రవీందర్ మాధవ్ ఒక ప్రకటనలో ఖండించారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఆరోగ్య, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఈనెల 16న రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట నిరసన చేపడితే అక్రమ అరెస్టులకు పాల్పడ్డారన్నారు. శుక్రవారం జిల్లాలోని కేజీబీవీల్లో, మండల విద్యా వనరుల కేంద్రాల్లో భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: గిరిజన ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ఉట్నూర్ (ఐటీఐ)లో మిగిలిన సీట్ల ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు https://iti.telangana.gov.in ఈనెల 19 నుంచి 30 వరకు ఒరిజనల్ సర్టిఫికెట్లను స్కాన్ చేసి వెబ్‌సైట్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 94902 02087 సంప్రదించాలని కోరారు.

ఆధార్ సెంటర్ లేక అవస్థలు



సిరికొండ తహసీల్దార్ కార్యాలయం

- తప్పుల సవరణ కోసం ఇతర మండలాలకు
- ఆర్థిక భారంతో పాటు సమయం వృథా
- సిరికొండలో ఏర్పాటు చేయాలని కోరుతున్న ప్రజలు

సిరికొండ: ఆధార్ సామాన్యుడి హక్కు. కానీ ఈ కార్డు లేకపోతే మనిషికి అసలు గుర్తింపే ఉండదు. అలాంటి గుర్తింపును ఇచ్చే కార్డు పొందాలంటే మండల ప్రజలు మాత్రం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ఆధార్ సెంటర్ లేకపోవడంతో నానా కష్టాలు పడుతున్నారు.

ఇతర మండలాలకు..

నూతనంగా ఏర్పడిన సిరికొండ మండలంలో 19 గ్రామ పంచాయతీలు, 52 గ్రామాలు ఉన్నాయి. మండలంలో ఆధార్ కేంద్రం లేకపోవడంతో గ్రామీణ గిరిజనులు 14 కిలోమీటర్ల దూరంలోని ఇచ్చోడ, 13 కిలోమీటర్ల దూరంలోని ఇంద్రవెల్లికి వెళ్లి నానా అవస్థలు పడుతున్నారు. దూర భారంతో పాటు సమయం వృథా చేసుకొంటున్నారు. అక్కడి వరకు వెళ్లినా.. ఏమైనా ధ్రువీకరణ పత్రం, అధికారుల సంతకాలు లేకపోతే మళ్లీ తిప్పి పంపుతున్నారు. దీంతో చేసేది ఏమీలేక మండల ప్రజలు వెనుదిరిగి వస్తున్నారు.

ఆధార్ సెంటర్ ఏర్పాటు చేస్తే..

మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేస్తే మండలంలోని ప్రజలు పక్క మండలాలకు కాకుండా సొంత మండలంలో పని చేసుకోవచ్చు. దీంతో డబ్బు, సమయం ఆదా అవుతాయి. సంబంధిత అధికారులు స్పందించి తహసీల్దార్ కార్యాలయంలో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రెండుసార్లు ఇచ్చోడకి వెళ్లిన



ఆధార్ కార్డులో ఇచ్చోడ మండలం అని ఉంది. సిరికొండ మండలం మార్పు కోసం అధికారి సంతకం పెట్టించుకొని వెళితే.. పాం సరిగా నింపలేదని పంపించారు. దీంతో తిరిగి ఫాంను నింపి మళ్లీ వేరే రోజు రవాణా ఖర్చులు భరించి కుటుంబం మొత్తం ఇచ్చోడ ఆధార్ సెంటర్‌కు వెళ్లి సవరించుకున్నాం.

– అవుల సుభాష్, సిరికొండ

ఇబ్బంది పడుతున్నాం



మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ లేకపోవడంతో ఇచ్చోడ, ఇంద్రవెల్లికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇతర మండలాలకు వెళ్లలేక ప్రజలు తమ ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోలేదు. మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలి.

– రాథోడ్ గంగాధర్, రావుగూర్, సిరికొండ

అర్హులందరికీ 'గృహలక్ష్మి'

- బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు

నేరడిగొండ: అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం గృహలక్ష్మి పథకం మంజూరు చేస్తుందని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ అన్నారు. మండలంలోని వాంకిడి గ్రామస్తులు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సీఎం కేసీఆర్ కులమతాలకు అతీతంగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని, అందులో గృహలక్ష్మి ఒకటని తెలిపారు. కార్యక్రమంలో బోథ్ ఏఎంసీ మాజీ చైర్మన్ తిత్రె నారాయణ్ సింగ్, సర్పంచ్ ఆడెగం లాలు, ఉప సర్పంచ్ షేక్ అలీం, పీఏసీఎస్ చైర్మన్ నవీన్ కుమార్, షేక్ నజీర్, చిన్నయ్య, రాజేందర్, శ్రీను యాదవ్, రాజన్న, భూమన్న, రాజేశ్వర్, యూసుఫ్, తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి భవన నిర్మాణానికి విరాళం



ఎమ్మెల్యే బాపురావుతో వాంకిడి గ్రామస్తులు

బోథ్: మండల కేంద్రంలో దుర్గాదేవి భవన నిర్మాణానికి బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ రూ.2 లక్షల తన సొంత నిధులను ఇచ్చినట్లు దుర్గా కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం నాయిబ్రాహ్మణ సంఘం నాయకులు ఎమ్మెల్యేను కలిసి, కమ్యూనిటీ భవనానికి రూ. 3 లక్షలు కేటాయించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

మండలాభివృద్ధికి కృషి చేయాలి

ఆదిలాబాద్‌రూరల్: అధికారులు, ప్రజాప్రతినిధులు మండలాభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ గండ్రత్ రమేశ్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ రూరల్ మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో సమావేశ మందిరంలో నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సమస్యలపై అధికారులు స్పందించి వాటి పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అభివృద్ధిలో ఆదిలాబాద్ రూరల్ మండలాన్ని జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిపేలా చూడాలన్నారు. సమావేశంలో కోఆప్షన్ సభ్యుడు షేక్ ఆరిఫ్, ఎంపీడీవో దండనాయక్ లక్ష్మీకాంత్‌రావ్, ఎంపీవో ఆనంద్, డిప్యూటీ తహసీల్దార్ గణేష్, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ గండ్రత్ రమేశ్

తరోడ వద్ద తాత్కాలిక రోడ్డు

జైనథ్: మండలంలోని తరోడ వంతెన కుంగిపోవడంతో బేల– జైనథ్ జాతీయ రహదారి గుండా రాకపోకలు నిలిచిపోయి, ప్రజలు ఇబ్బందులు పడుతుండడంతో జోగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాత్నాల వాగుపై తాత్కాలిక రోడ్డు నిర్మించినట్లు డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కొత్త వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసినప్పటికీ ఇంకా పనులు ప్రారంభించకపోవడంతో, తాత్కాలిక రోడ్డు సదుపాయం కల్పించామన్నారు. ప్రజల రవాణా కష్టాలు తీర్చేందుకు ముందుకు వచ్చిన జోగు ఫౌండేషన్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ మార్శెట్టి గోవర్దన్, నాయకులు సర్సన్ లింగారెడ్డి, పురుషోత్తం యాదవ్, ప్రభాకర్, తదితరులు ఉన్నారు.



రోడ్డు పనులు పరిశీలిస్తున్న అడ్డి భోజారెడ్డి

కాంగ్రెస్ ఓబీసీ అధ్యక్షుడిగా సంజీవ్



సంజీవ్

బోథ్: బోథ్ కాంగ్రెస్ మండల ఓబీసీ అధ్యక్షుడిగా మర్లపెల్లి గ్రామానికి చెందిన సిరిసే సంజీవ్‌ను నియమించారు. జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షుడు అంబకంటి అశోక్ చేతుల మీదుగా శుక్రవారం నియామక పత్రం అందుకున్నారు. కార్యక్రమంలో దిలావర్ లక్ష్మారెడ్డి, బోథ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ, తదితరులున్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు

ఇంద్రవెల్లి: మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు తప్పవని ఎస్సై సునీల్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వద్ద వాహనదారులకు డ్రంకెన్ డ్రైవ్‌పై అవగాహన కల్పించారు. వాహనదారులు వాహన పత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై కత్తి లీలారావ్, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఇచ్చోడ: మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం ఎస్సై నరేష్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనదారులు వాహన పత్రాలను తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలన్నారు. లైసెన్స్, ఇన్సూరెన్స్, ఆర్సీ పత్రాలను ఉంచుకోవాలన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం ఎంపీపీ పోటే శోభాబాయి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి శ్రీకాంత్‌రెడ్డి నివేదిక చదువుతుండగా.. తాగు నీటి సరఫరా విషయంలో సభ్యులు నిలదీశారు. ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ ఇన్‌చార్జి ఏపీవో జైస్వాల్ సంతోష్ మాట్లాడుతుండగా.. సర్పంచ్‌లకు సమాచారం ఇవ్వకుండానే పంచాయతీ కార్యదర్శులు మొక్కలు పంపిణీ చేశారని మండిపడ్డారు. పశు వైద్యశాఖ ఇన్‌చార్జి వైద్యాధికారి రమేశ్ సమావేశానికి రాకపోవడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి వైద్యాధికారి రమేశ్, ఇంద్రవెల్లి రెంజ్ అధికారి సంతోష్‌కుమార్‌లపై చర్యలు తీసుకోవాలని సభ్యులు తీర్మానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, ఇన్‌చార్జి తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో పుష్పలత, సర్పంచ్‌లు కోరెంగా గాంధారి, కినక జగదీరావ్, ఎంపీటీసీలు కోవా రాజేశ్వర్, స్వర్ణలత, సులోచన, జంగుబాయి, ఆశబాయి పాల్గొన్నారు.



ప్రగతి నివేదిక చదువుతున్న అధికారులు

'వలస లంబాడాలకు టికెట్ ఇవ్వొద్దు'

ఉట్నూర్‌రూరల్: రానున్న ఎన్నికల్లో ఖానాపూర్ నియోజకవర్గం నుంచి ఏపార్టీ కూడా వలస లంబాడాలకు టికెట్ ఇవ్వొద్దని లంబాడా గిరిజన జేఏసీ నాయకులు పవార్ దేవిదాస్, గంగారాం నాయక్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం ఉట్నూర్ ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. నియోజకవర్గానికి చెందిన స్థానికులకే టికెట్ కేటాయించాలన్నారు. సమస్యలపై ఇక్కడి ఆదివాసీ గిరిజనుల కష్టాలపై అవగాహన లేని టికెట్ ఇస్తే చిత్తుచిత్తుగా ఓడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో జేఏసీ నాయకులు నేతావత్ రాందాస్, మహేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దేవిదాస్ నాయక్

ఈవీఎం పనితీరుపై అవగాహన



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

బోథ్: మండలంలోని కౌఠ(బి) గ్రామంలో శుక్రవారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అధికారులు ఈవీఎం, వీవీప్యాట్‌లపై అవగాహన కల్పించారు. ఓటు ఎలా వేయాలో తెలియజేశారు. ఓటరు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) శ్యామ్ సుందర్, భోజన్న, సిబ్బంది ఉన్నారు.

చెక్కుల పంపిణీ

బోథ్: సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేస్తున్న లబ్ధిదారులకు బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ ఆదిలాబాద్‌లోని తన నివాసంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. బోథ్‌కు చెందిన చంద్రమోహన్‌కు రూ. 49 వేలు, ప్రవీణ్‌కు రూ. 22 వేలు, పోతన్నకు రూ. 18 వేల విలువ గల చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేందర్, సత్యనారాయణలు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: మండలంలోని చందునాయక్‌తండా గ్రామానికి చెందిన బద్రావ్ సకలాల్ మంజూరైన రూ.36 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ తన నివాసంలో చెక్కు అందజేశారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ కానిండే రాజారాం, ఉప సర్పంచ్ సంతోష్, ప్రకాష్ పాల్గొన్నారు.

సమాచారం

నేడు 5కె రన్

బోథ్: బోథ్ నియోజకవర్గ స్థాయి 5కె రన్‌ను శనివారం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సుభాష్ చంద్ర తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల వరకు నిర్వహిస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, యువకులు, పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉట్నూర్‌రూరల్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శనివారం ఉదయం 6గంటలకు 5కె రన్ నిర్వహించడం జరుగుతుందని డిప్యూటీ తహసీల్దార్ భుజంగరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్లను చైతన్యం పరిచేందుకు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. స్థానిక కేబీ కాంప్లెక్స్ నుంచి పాతబస్టాండ్ మీదుగా 5కె ఉంటుందన్నారు.

ఇచ్చోడ: జిల్లా సంయుక్త ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు శనివారం ఉదయం 6.30 గంటలకు నియోజకవర్గ స్థాయి నిర్వహించే 5కె రన్ విజయవంతం చేయాలని తహసీల్దార్ తూకారం తెలిపారు. బోథ్ తహసీల్దార్ కార్యాలయం నుంచి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల వరకు కొనసాగుతుందన్నారు. యువకులు, స్వచ్ఛంద సంస్థలు, నాయకులు పాల్గొనాలని కోరారు.

ఉచిత గుండె వైద్య శిబిరం

బోథ్: మండల కేంద్రంలోని ప్రసాద్ హాస్పిటల్‌లో శనివారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆసుపత్రి నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. మెడికవర్ ఆసుపత్రి గుండె సంబంధిత వైద్యులు రానున్నట్లు పేర్కొన్నారు. ఉచితంగా గుండె పరీక్షలు చేస్తారని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున శనివారం ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ సదానందం ఒక ప్రకటనలో తెలిపారు. ఖానాపూర్ ఆర్ఎస్ మండలంలోని ఖానాపూర్, రాజీవ్‌నగర్ కాలనీ, అశోక్‌రోడ్, కొలిపురా, బొక్కలగూడ ఏరియాలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. కైలాస్‌నగర్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్ తెలిపారు. శాంతినగర్, కుమ్మరి వాడ, పాలిటెక్నిక్, అబిడెన్స్ కాలనీ, ఓల్డ్ హౌసింగ్ బోర్డు, ఎల్ఐసీ, ఆర్టీవో కాలనీ ఏరియా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

ఈ సమస్య.. ఇంకెన్నాళ్లు?



బోథ్ మండలం మర్లపెల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలోని మూత్రశాలలు శిథిలావస్థకు చేరాయి. పైగా వీటికి డోర్లు కూడా లేవు. దీంతో మూత్రశాలల చుట్టూ పరదా కట్టారు. ఈ పాఠశాలలో 230 మంది చదువుతుండగా ప్రధానంగా విద్యార్థినుల బాధలు వర్ణనాతీతం. ప్రభుత్వం 'మన ఊరు–మన బడి' కింద నిధులు మంజూరు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో 'ఈ సమస్య ఇంకెన్నాళ్లు' అని విద్యార్థినులు ప్రశ్నిస్తున్నారు. – బోథ్

ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి

ఆదిలాబాద్‌రూరల్: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 373 జయంతిని శుక్రవారం జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలనీలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు రామకిషన్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ మొదటి గోల్కొండను ఏలిన బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్ యాదవ్, శరత్ కుమార్, రంగు యోగేష్ గౌడ్, సదానందర్ గౌడ్, సత్యనారాయణగౌడ్, సతీష్‌గౌడ్, సందీప్‌గౌడ్, శివగౌడ్, అంజాగౌడ్, శివకుమార్‌గౌడ్, యశంత్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, సురేష్ గౌడ్ పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌రూరల్: నివాళులు అర్పిస్తున్న నాయకులు



నేరడిగొండ: నివాళులర్పిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని శుక్రవారం బీఎస్పీ నాయకులు పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ ఖానాపూర్ నియోజకవర్గ కార్యదర్శి సోయం రాందాస్, పెందోర్ అంకుష్, వాగ్మారే సుద్ధోధన్, సాయికుమార్, దీపక్, మెస్రం మురారీ, గౌతమ్, మాధవ్ పాల్గొన్నారు.

బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో..

బీఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ భవనం నుంచి ఆర్టీసీ బస్టాండ్ చేరుకుంది. అనంతరం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు గడుగు మహేందర్, జిల్లా ఇన్‌చార్జి రత్నపురం రమేశ్, లక్ష్మణ్ యాదవ్, ప్రేమకుమార్, మెస్రం భీమ్, పంచ్షాల్, సృజన్, దేవిదాస్, ఛత్రపతి, అరవింద్ పాల్గొన్నారు.

కుల వ్యవస్థను రూపుమాపేందుకు కృషి

ఆదిలాబాద్: కుల వ్యవస్థను రూపుమాపేందుకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కృషి చేశారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిట్యాల సుహాసిని రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. నేటి యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు.

పోరాట స్ఫూర్తి గొప్పది..

నేరడిగొండ: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తి గొప్పదని మండల గౌడ సంఘం అధ్యక్షుడు లింగాల సంతోష్ గౌడ్, ఉపాధ్యక్షుడు అతికం సుభాష్ గౌడ్‌లు అన్నారు. శుక్రవారం సర్వాయి పాపన్న జయంతిని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సభ్యులు దుర్కి భీంరావ్ గౌడ్, గజ్జల శ్రీనివాస్ గౌడ్, జాగిరి రాజా గౌడ్, అశోక్ గౌడ్, చంద్రశేఖర్ గౌడ్, కుంట రవిచంద్ర గౌడ్, లక్ష్మణ్ గౌడ్, అంజి గౌడ్, సాయిరాజ్ గౌడ్, దుర్గ సాయిగౌడ్ పాల్గొన్నారు.

'ప్రజలను మోసం చేస్తున్న సీఎం కేసీఆర్'

ఇచ్చోడ: డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరుతో సీఎం కేసీఆర్ ప్రజలను మోసం చేస్తున్నాడని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మడి బీంరెడ్డి, కదం బాబారావులు ఆరోపించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ తుకారాంకు వినతిపత్రం అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్‌రూంలు ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కేంద్రె నారాయణ, జిల్లా కార్యదర్శి కొల్లూరి చంద్రశేఖర్, గోపి, సునీల్, అనిల్, రాము, రామేశ్వర్, భరత్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు